

# అద్వైతం

## – శారద (బ్రిస్బేన్)

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

### 2013-జనవరి

"ఏమిటి రాసుకుంటున్నావు అశోక్?" రాత్రి తొమ్మిది తరవాత పిల్లలూ భానూ పడుకున్నాక హాల్లో కూర్చొని ప్రశాంతంగా రాసుకోవడమో, డిపార్ట్‌మెంట్ పని చూసుకోవడమో చేసుకుంటాడు అశోక్.

కొత్తగా కొన్న లేప్‌టాప్ నించి కళ్ళెత్తి భాను వైపు చూసాడు.

'"మా పత్రికకి ఒక వ్యాసం భానూ. కిందటి నెల ఢిల్లీలో జరిగిన మానభంగమూ-హత్యా కేసు గురించి."

"ఢిల్లీలోనా? ఏది, ఆ నిర్భయ కేసేనా?"

"అవును. ఎంత దారుణమైన నేరం! ఈ వ్యాసం తో పాటు ఒక చిన్న స్కెచ్ కూడా వ్రాస్తున్నాను. శనివారం కేంపస్‌లో ఒక కేండిల్ లైట్ విజిల్ చేస్తున్నాం. అందులో ప్రదర్శించడానికి మా డిపార్ట్‌మెంట్ విద్యార్థులంతా ప్రాక్టీసు చేస్తున్నారు."

"నాకొక్కటి అర్థం కావడం లేదు అశోక్! నువ్వు వ్రాసే వ్యాసాలూ, మీ విద్యార్థులు ప్రదర్శించే స్కెచ్‌లూ అన్నీ మేధావి వర్గానికి చెందిన వాళ్ళూ, విద్యాధికులూ మాత్రమే చూస్తారు.! రేప్ అనేది ఎంత హీనమైన నేరమో వాళ్ళకి తెలియదంటావా? నీ ఉన్నతమైన భాషా, ఆదర్శవంతమైన ఆలోచనలూ అవసరమైన వారికి చేరుతున్నాయా?"

"ఆగాగు! నీ అభిప్రాయం ప్రకారం రేప్ లాటి నేరాలు చదువూ, సంస్కారమూ లేని వాళ్ళే చేస్తారన్నట్టు వుంది. ఎంతో మంది సోఫిస్టికేటేడ్ విద్యాధికులూ, పై వర్గాలకి చెందిన వాళ్ళూ కూడా ఎటువంటి నేరాలకీ ఘోరాలకీ పాల్పడతారు. నేను రాస్తున్న వ్యాసాలు చదివీ, నాటకాలు చూసి కొంతమందైనా ఆలోచనలో పడొచ్చు. ఇంకొంతమందికి ఇటువంటి నేరాలని కప్పి పెట్టేకంటే పోలీసుల దృష్టికీ, సమాజం దృష్టికీ తీసికెళ్ళి చర్చించడం తప్పు కాదన్న జ్ఞానం కలగొచ్చు."

"ఏమో అశోక్! నాకెందుకో సాహిత్యంతో సంఘంలో పెద్ద మార్పులు తీసుకురావడం అంత తేలిక కాదనిపిస్తుంది"

"ఇంగ్లీషు సాహిత్యాన్ని బోధించే లెక్చరరు భార్య అనవలసిన మాటలేనా అవి?"

నవ్వింది భాను.

"జోకులటుంచితే, సాహిత్యం సహాయంతో దేశ స్వాతంత్ర్యాన్నే తెచ్చుకున్న చరిత్ర మనది! సాహిత్యానికి ఆలోచనలమీద వున్న ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయకు భానూ."

"అదంతా మన చిన్నప్పుడు డెభ్భైల్లో ఎనభైల్లోని మాట. ఇప్పుడు మనుషులకి సినిమాలకీ టీవీ సీరియళ్ళకీ ఎక్కళ్ళేని టైమూ సరిపోవటంలేదు. వాటిల్లో నేర్పించే విలువల గురించీ, ఆదర్శాల గురించీ ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది."

"అదీ నిజమేలే," లేప్‌టాప్ మూసేస్తూ నవ్వాడు అశోక్.

"అసలు మన సినిమాలే సగం రేప్ కల్చర్‌ని తయారు చేస్తున్నాయి కదా? ఇలాటి రోజుల్లో మన పిల్లలని ఎలా పెంచి పెద్ద చేస్తామో అని భయం కూడా వేస్తుంది!"

"అవును భానూ! పిల్లలు ఏమాలోచిస్తున్నారో, ఎవరితో స్నేహం చేస్తున్నారో క్షణం క్షణం కనిపెడుతూ వుండాలి!"

"సరేలే, పడుకుందాం పద, నిద్రొస్తూంది."

★★★★★★★★★★★★★★★

మర్నాడు ఇన్స్‌టిట్యూట్‌లో తన గదిలో కూర్చొని పేపర్ ఎడిట్ చేస్తున్నాడు అశోక్. కళ్ళు పదాలు చదువుతూ సవరణలు చేస్తూ వున్నా, అతని మనసు భాను మాటల గురినే ఆలోచిస్తూ వుంది. నిజంగా తాను చేసే సాహిత్య సృష్టి వల్ల ఎవరికీ ఏ ప్రయోజనమూ లేదా? అసలు మనుషుల్లో నేర ప్రవృత్తి తగ్గించే శక్తి దేనికుంది? సాహిత్యానికి ఉన్నట్టు కనిపించటంలేదు. మీడియా? సినిమా? చదువు? కానీ చదువుకున్న వారిలో నేరస్థుల మాటేమిటి? ప్రభుత్వమూ, లా ఎండ్ ఆర్డర్ వ్యవస్థ చేయగలది కూడా పరిమితంగానే కనబడుతుంది.

ఫ్రెంచ్ లెక్చరరు ప్రకృతి మేడం కిందటి వారం మాట్లాడింది. ఒక నృత్య నాటిక, కూచిపూడి నాట్యంలో అభినయించి స్త్రీల పట్ల జరుగుతున్న లైంగిక హింసని ప్రదర్శిద్దామని. నిజానికి ఆలోచన బాగుంది. కానీ, నృత్య ప్రదర్శనంటే, ప్రాక్టీసూ, ఏర్పాట్లూ, ఎన్నెన్ని పనులు. అంత తీరుబడి తనకుందా? ఇటువంటి పై పని యేది పెట్టుకున్నా ఇంటి పని భాను పైన పడుతుంది. అది తనకి అన్యాయంగా తోస్తుంది.

ఇప్పుడసలు అటువంటి కార్యక్రమంలో పాల్గొనేంత ఓపికా, ఉత్సాహమూ వున్న విద్యార్థులున్నారా? డిపార్ట్మెంట్ నోటిసు బోర్డుమీద ప్రకటిస్తే ఎవరైనా వస్తారో రారో? పైగా అందర్లోనూ తను నవ్వుల పాలయ్యే అవకాశమే యెక్కువ.

★★★★★★★★★★★★★★★★★★

2013– జులై

హాలంతా నిశ్శబ్దంగా వుంది. లైట్ల కాంతి తగ్గింది, ప్రోగ్రాం మొదలవబోతుందనడానికి సూచనగా. రెండో వరసలో కూర్చున్న భాను, ఆశా, కోమలీ, శరత్, ఇంకా ఇంగ్లీషు డిపార్టుమెంటుకి చెందిన విద్యార్థినీ విద్యార్థులు అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. అశోక్ గత ఆరు నెలలుగా మనసూ, ఆత్మా, శ్వాసా అన్నీ ధారపోసి రూపొందించిన కార్యక్రమం "ఆమె–ఆకాశంలో సగం" ఇవాళే ప్రదర్శిస్తున్నారు.

కర్టెన్ పైకి లేచింది.

అశోక్ గొంతు గంభీరంగా, ఆవేదనతో మైక్రోఫోన్‌లోంచి వినపడింది.

"ఆమె, ఆకాశంలో సగం! కానీ, ఇప్పుడు..."

స్టేజీ అంతటా మళ్ళీ నిశ్శాబ్దం అలముకుంది. ఆ నిశ్శబ్దంలో ఒక అమ్మాయి, చెట్టుకింద, కూర్చొని బొమ్మలు గీసుకుంటూంది. ఆమె వెనక తెర పైన వెలుగు నీడల కలయికలో ఆమె జీవితం గడిచిపోవడం కనిపిస్తోంది. బడీ, బస్సూ, అమ్మా, నాన్న, బామ్మా, తాతయ్యా, తమ్ముడూ, నవ్వులూ, దెబ్బలాటలూ, జడలూ, పూవులూ, ఓణీలూ, పుస్తకాలూ, అన్నీ కదిలి పోతూ వున్నాయి.

ఇంతలోనే ఆ నిశ్శబ్దం భళ్ళున బద్దలైంది. స్టేజీ అంతటా నల్లటి బట్టలు వేసుకున్న మగవారు ఆ అమ్మాయి చుట్టూ చేరి కరాళ నృత్యం మొదలు పెట్టారు. వాళ్ళందరూ ఒకరి చేయి పట్టుకొని ఇంకొకక్రు నాట్యం చేస్తున్నారు. చూస్తూ వుంటే అది ఒక మగవాడో, ఇద్దరు మగవాళ్ళలాగానో లేదు. ఒక వ్యవస్థలా వుంది.  నృత్య నాటిక సాగిపోయింది.

గంట సేపటి తరవాత నాటిక ముగిసి లైట్లు వెలిగాయి. ప్రేక్షకులంతా తమను చుట్టిముట్టిన ఉద్వేగంలోంచి తేరుకోవడానికి దాదాపు ఒక నిమిషం పట్టింది. ఆ తరవాత కరతాళ ధ్వనులు మొదలయ్యాయి.

చుట్టూ వున్న జనాన్ని తప్పించుకొని భాను స్టేజీ వెనక్కి వెళ్ళింది. ఒక్కడే స్టేజీ పక్కన వింగులో చీకట్లో నిలబడి వున్నాడు అశోక్! అతన్ని చుట్టేసింది భాను.

"అశోక్! అద్భుతంగా వుంది. అయాం సో ప్రౌడ్ ఆఫ్ యూ! నీ కష్టమంతా స్టేజీ పైన కనిపించింది. నీ మనసులో బాధంతా అద్భుతంగా చూపించావు. యూ ఆర్ సో గ్రేట్!"

వాళ్ళని వెతుక్కుంటూ లోపలికొచ్చారు ఆశా, శరత్, కోమలీ.

"చాలా బాగుంది అశోక్! నువ్వే రాసి, కొరియోగ్రాఫ్ చేసి, ఇంత పెద్ద ప్రోగ్రాం చేసావంటే, ఎంత కష్టపడివుంటావో! వెల్ డన్!" శరత్ అశోక్ భుజం మీద తడుతూ అన్నాడు.

"అవును! ఎంత కష్ట పడ్డాడో చెప్పలేను! ఆరు నెలలుగా ఇదే ధ్యస!" భాను గర్వంతో కళ్ళు మెరుస్తూ వుండగా అంది. నవ్వాడు అశోక్.  అతని మనసంతా ఏదో భారం దించుకున్నట్టు తేలికగా వుంది. ఎవరి మాటలూ, అభినందనలూ అతని చెవికెక్కటంలేదు. మబ్బులేని ఆకాశంలా, మనసంతా నిర్మలంగా, ఖాళీగా అనిపిస్తూ వుంది.

అందరూ బయటికొచ్చారు. బయట అశోక్ కూచిపూడి నేర్చుకున్న స్కూలు విద్యార్థులూ, గురువుగారూ, ఇంగ్లీషూ, ఫ్రెంచి డిపార్టుమెంటు ప్రొఫెసర్లూ, విద్యార్థులూ, అంతా కోలాహలంగా వుంది. గురువుగారు అతన్ని హత్తుకున్నారు.

"ప్రాచీన కళలకి సంఘంలో ఇక స్థానం వుండబోదేమోననీ, అవెందుకూ పనికిరావనీ అనుకుంటూ వుంటారంతా అశోక్! నువ్వు అటువంటి ఆలోచన తప్పని నిరూపించావు. ఎన్నేళ్ళయినా నువు నేర్చుకున్న విద్యని మరిచిపోలేదు. అంతకు మించి నాకింకేం కావాలి!" ఉద్వేగంతో ఆయన కళ్ళు తడిసాయి.

భాను బేగ్‌లో సెల్ ఫోను మోగింది.

"హలో! భార్గవ్! ఆల్ గుడ్. నాన్న ప్రోగ్రాం బాగా జరిగింది. హాలంతా నిండి పోయింది. డబ్బా? ఏమో, మరి. కానీ, నాన్న ఈజ్ వెరీ హేపీ. ఇద్దరూ అన్నాలు తిన్నారా? నానమ్మ పడుకున్నారా? సరే, మేమింకో గంటలో ఇంటికొస్తాం."

"నీ కొడుక్కి ఈ ప్రోగ్రాంలో నీకెంత డబ్బొచ్చిందోనని మహా టెన్షన్‌గా వుంది." కారు స్టార్ట్ చేస్తూ అంది భాను.

"వాడిదంతా నీ పోలికే మరి!" అశోక్ నిద్రలో కళ్ళు కూరుకొని పోతూ వుంటే అన్నాడు.

★★★★★★★★★★★

"ఆ రోజు నువ్వు నా రాతల వల్ల పెద్ద ప్రయోజనం వుండదని అన్నప్పుడు కొంచెం బాధనిపించినా, నిజమేనేమో అనిపించింది భానూ! ఆ మాటకొస్తే ఆస్కార్ వైల్డ్ కూడా అదే అన్నాడు, "ఆల్ ఆర్ట్ ఈజ్ క్వయిట్ యూజ్‌లెస్" అంటూ. అసలు కళలకి ఏ ప్రయోజనం వుండదు, వుండకూడదు కూడా అని చాలామంది లబ్ద ప్రతిష్ఠుల అభిప్రాయం. కానీ నిన్నటి నాటక ప్రదర్శన తరవాత వొచ్చిన రెస్పాన్స్ చూస్తే, చాలా భరోసాగా అనిపించింది."

"ఈ విషయం గురించి నేను కూడా చాలా ఆలోచించాను అశోక్. బహుశా నీలాటి కళాకారులు, సాహిత్య కారులూ ఏదో ప్రయోజనాన్ని ఆశించి పని చేయరు. సృజన వారి సహజమైన మెంటల్ స్టేట్ కాబట్టి చేసుకు పోతూ వుంటారేమో! క్రియేటివిటీ నీటి ప్రవాహంలాటిది కాబోలు. దానంతట అది ప్రవహిస్తూనే వుంటుంది! అయితే, నువ్వు రిహార్సలు, రాతలు అంటూ నీ పనిలో మునిగిపోయినప్పుడు నాకు చాల కోపమొస్తుంది కూడా. నా ఒక్క దానిమీదే ఇదంతా పడేసి నువ్వేమో నీకిష్టమైన పని చేస్తూ ప్రశాంతంగా వుంటున్నావు అని మనసు నస పెడుతుందనుకో! అయినా, అయాం క్వైట్ ప్రౌడ్ ఆఫ్ యూ!"

"నేనేమో నీకు థాంక్స్ చెప్పాలి భానూ! నేనిలా ఏ పై పని పెట్టుకున్నా, ఇంటి బాధ్యతంతా నీ మీదే పడుతుందనీ, ఒక్కదానికి అన్నీ సంబాళించుకోవడం కష్టమవుతుందనీ తెలుసు. అప్పుడప్పుడూ మనిద్దరం ఈ విషయమై దెబ్బలాడుకున్నా, నువ్వు నాకు ఆ అవసరమైన స్పేస్ ఇస్తూనే వుంటావు."

"బాధ్యతలంటే గుర్తొచ్చింది! నాన్నని డాక్టరు దగ్గరికి తీసికెళ్ళాలి. కాళ్ళు బాగా లాగుతున్నాయనీ, రెండు రోజులుగా నిద్ర పోవడంలేదనీ ఇంటి పని చేసే నీలవేణి ఫోన్ చేసి చెప్పింది. సోమవారం సెలవు పెట్టాను. ఆ రోజు తీసికెళ్తను."

"కావాలంటే నేను తీసికెళ్తాలే! నేనూ సెలవు పెట్టేస్తాను. ఇద్దరం ఎట్లైనా వెళ్దాం."

"నాన్నతో నేను వెళ్తాలే. నువ్వు ఇవాళ పిల్లల్ని స్కూలు నించి ఇంటికి తీసుకొచ్చి కొంచెం వంట ప్రయత్నం చేయి. నేను డాక్టరు దగ్గరి నుంచి నాన్నని తీసుకొని ఇంటికొచ్చేస్తాను."

2014–జనవరి

అందంగా, పెద్దగా తనకలలకి ప్రతిరూపంలా వుంది విల్లా. కొత్తగా వేసిన పెయింటు వాసన ఆహ్లాదంగా వుంది. పధ్నాలుగేళ్ళ భార్గవ తన ఎక్సయిట్‌మెంటు ఎక్కువగా చూపకుండా గంభీరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడు. చిన్నది అనఘ మాత్రం ఇల్లంతా గంతులు వేస్తుంది.

కొత్తగా చేతికందిన తాళాల గుత్తి గట్టిగా పట్టుకుంది భాను. ఇంటి తాళాలు ఆమె చేతిలో, కొంచెం బరువనిపించిందామెకి. సంతోషంతో పాటు ఏదో భయం కూడా చుట్టుముట్టింది. కొంచెం ధైర్యం కోసం అశోక్ వైపు చూసింది.

ఇంతలో బిల్డరు నవ్వుమొహంతో ఆమె దగ్గరకు వచ్చాడు. చేతిలో వున్న ఫోల్డరు ఆమె చేతిలో పెడుతూ, "కంగ్రాచ్యులేషన్స్ మేడం. మీ విల్లా అద్భుతంగా తయారైంది. ఇంత అందమైన ఇంట్లో వుండబోతున్నారు. ఇది మీరు అప్పుడే కొనేయడం మంచిదైంది. ఈ సంవత్సరం తెలంగాణ వచ్చిన తరవాతైతే ఇంకా ఖరీదెక్కువయ్యేది." ఎందుకో అతని మాటలకి ఆమె చిరాకు ఎక్కువైంది. ఏమీ జవాబివ్వకుండా తల పంకించి అక్కణ్ణించి లోపలికి నడిచింది.

మునికాళ్లపై నిలబడి కాంపౌండ్ వాల్ బయటికి చూసింది. ఇంకా కొత్తగా కడుతున్న ఇళ్ళు చాలానే వున్నాయి. అయితే ఇది గేటెడ్ కమ్యూనిటీ కాబట్టి సెక్యూరిటీ పెద్ద సమస్య కాకపోవచ్చు. బయట ఇంకా అక్కడక్కడా రాళ్ళూ రప్పలూ నిండి,పూర్తికానీ రోడ్లూ, కొంచెం ఒంటరిగానే వుంది. అయితే ఈ నల్లగండ్ల ప్రాంతమంతా బాగా డెవలప్ అవుతుందంటు న్నారు.ఆమె దిగులు అర్థమైన వాడిలా అన్నాడు బిల్డరు,

"మేడం, మీ గృహప్రవేశం ఆగస్టులో కదా. అప్పటికి ఈ ఏరియాని మీరసలు గుర్తుకూడా పట్టలేరు!"

ఎంతో డబ్బు ధారపోసి అశోక్‌కీ అత్తగారికీ నచ్చకపోయిన పట్టుబట్టి కొనుక్కున్న ఇల్లు. ఈ నల్లగండ్ల ఏరియాలో ఇంకొంతమంది కొలీగ్స్ కొంటూ వుండడంతో ధైర్యం చేసి కొనేసింది. ఆఫీసులో లోను వచ్చిన మాట నిజమే కానీ, వాళ్ళు ఇచ్చినదానికి ఇంతకింతా పని పిండుకుంటారన్నదీ నిజమే. ఎదుగుతున్న పిల్లలతో తను ఎప్పుడూ ఆఫీసు పనితో బిజీగా వుంటే ఎలా కుదురుతుంది? ఆమెకి ఈ వొత్తిడి మధ్య ఆ బిల్డర్ ఇస్తున్న కుహనా హామీలు మనసుకి ధైర్యాన్నివకపోగా చిరాకెత్తిస్తున్నాయి.

"అమ్మా! ఇక్కడ మనం సినిమా ప్రొజెక్టర్ పెట్టుకోవచ్చు," భార్గవ అప్పుడే డ్రాయింగ్ రూం గోడ చూస్తూ అన్నాడు. పధ్నలుగేళ్ళకే వాడు తన కంటే పొడుగెదిపోయాడు. బక్క పలచగా, అడ్డ గీతలున్న టీ–షర్టుతో, కళ్ళజోడుతో, అచ్చం అశోక్ లాగే వున్నాడు. వాణ్ణి చూస్తే ఆమెకి ముద్దొచ్చింది.

"సోఫాలు మనం చక్కగా పక్క పక్కనే వేసుకుంటే థియేటర్‌లా ఎరేంజ్ చేసుకోవచ్చు!"

"ఇప్పుడు ఈ హాలు ప్రసాద్స్ ఐమాక్స్‌లా మారుస్తావా?" అశోక్ అన్నాడు పరధ్యానంగా.

అనఘ మెల్లగా ఒక్కొక్క రూమే చూసుకుంటూ మెల్లిగా నడుస్తు హాల్లోకి వొచ్చింది.

"అమ్మా, నా రూం యేదీ? నేను నానమ్మతో షేర్ చెసుకోను! అన్నయ్యతో అసలే షేర్ చేసుకోను. నాకు ఒక రూం కావాలి! ఆ బాల్కనీ వున్న చిన్న రూం నాది! ముందే చెప్తున్నాను."

"సెలెక్షను అయిపోయిన తరవాత అడగటం ఒకటే తక్కువ!" భార్గవ మాటలకి భానూ, అశోక్ నవ్వారు. వున్నట్టుండి అనఘ అడిగింది,

"అమ్మా! సమ్మర్ హాలిడేస్ తరవాత స్కూలు మారాలా?" ప్రశ్న చిన్నదే అయినా దాన్లో ఎంతో దిగులు దాగుంది.

"అవును, కొత్త స్కూలూ,కొత్త స్నేహితులూ! ఎక్సైటింగ్ టైం! నా టీంలో పని చేసే విఘ్నేశ్ కూతురు కూడా అదే స్కూలు, నీ క్లాసే. వాళ్ళిల్లు పక్క స్ట్రీట్‌లొనే. ఇద్దరూ కలిసి వెళ్దురుగాని." భాను అనునయించింది. భార్గవ్ కూడా చెల్లెలి పక్కనే కూర్చున్నాడు.

"డోంట్ వరీ బేబీ! నువ్వు చాలా తొందరగా ఫ్రెండ్స్ చేసుకుంటావుగా? కొత్త స్నేహితులని  బోలెడంత మందిని పోగేస్తావు!"

"మరి అప్పుడప్పుడూ మన పాత ఇంటికి వెళ్ళి పాత ఫ్రెండ్స్‌తో ఆడుకోవచ్చా?"

నవ్వాడు అశోక్. జీవితంలో అలా వెనక్కి వెళ్ళే వీలవుతుందా?

భాను ఇంకొకసారి లేచి ఇల్లంతా చెక్ చేసింది. స్విచ్చిలూ, నల్లాలూ, కప్–బోర్డులూ అన్నీ వదలకుండా, తననుకున్నట్టే వున్నాయని నిర్ధారించుకుంది. ఇంకొక ఆరు నెలల్లో తాను ఈ విల్లాలో, విశాలమైన వంటింట్లో, అందమైన పెరట్లోవుండబోతుంది. ఆమెకి ఊహించుకుంటేనే ఆనందంగా అనిపించింది.

మరొక్కసారి బిల్డరుకి ధన్యవాదాలు చెప్పి ఇంటికి బయల్దేరారు. వాళ్ళ ఆశల్లాగే అందంగా వుంది ఇల్లు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★

"నా మీద కోపమా అశోక్?" ఆ రాత్రి పడుకోబోయే ముందు అడిగింది భాను.

"నీ మీద కోపమెందుకు భానూ? నువ్వైనా మన కుటుంబం మంచి కోసమే కదా ఏం చేసినా? నాతో సమానంగా, మరీ మాట్లాడితే నాకంటే ఎక్కువగా మా కోసం కష్టపడతావు. కానీ ముందు ముందు మనకున్న ఖర్చులు తలచుకుంటే భయమేస్తుంది."

"అవును! ముందు మన ఫర్నీచరు మార్చాలి. కారు మార్చాలి. బోలెడు ఖర్చుంది. కానీ, నాకు ఆఫీసు బస్సొస్తుంది. నీకూ ఇన్స్టిట్యూట్‌కి దగ్గర. పిల్లలని నువ్వు స్కూల్లో దింపు, నేను తీసుకొస్తా. ఖర్చుల మాట కొంచెం ఇబ్బంది అయే మాట నిజమే అశోక్. కానీ, ఇంకొన్ని నెలల్లో రాష్ట్రాల విభజన జరగబోతుంది. స్థలాల ధరలూ, ఇళ్ళ ధరలూ ఆకాశంలోకెళ్ళిపోతాయి. ఇంకొన్ని యేళ్ళైతే మనం అసలు ఆలోచన కూడా చేయలేం. నిజంగా మనకి చాలా ఇబ్బంది అయితే నాన్నని సహాయం అడుగుతాను!" ఈ మాటని ఎప్పట్లా ఖండించలేదు అశోక్.

★★★★★★★★★★★★★★★★★★★★

## 2014-జూన్

ఫాకల్టీ లౌంజ్ రూం ఎప్పట్లా టీ వాసనా, చాక్ పీసు వాసనలతో నిండిపోయి వుంది. ఏసీ పని చేస్తున్నా అదోలాటి ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. అశోక్ చేతిలో తమ కొత్త ఇంటి గృహప్రవేశానికి ఆహ్వానిస్తున్న పత్రికలున్నాయి. ఇవాళ దిపార్ట్మెంట్ కొలీగ్స్6ని ఆహ్వానించాలని తీసుకొచ్చాడు కానీ, ఇవ్వాలంటే ఏదో వెనక్కి లాగుతోంది.

నోటీసుబోర్డు దగ్గర నిలబడ్డాడు మొహమాటంగా.

"హ్మ్మ్.. నూతన గృహ–ప్రవేశం అన్నమాట. మీకు ఆల్రెడీ కూకట్‌పల్లిలో ఒక అపార్ట్మెంటు వుండాలి కదా?" తోటి అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ అన్నాడు, చేతిలో అహ్వాన పత్రికని ఆడిస్తూ.

"అవునండీ! పిల్లలు పెద్దవుతున్నారని ఇంకొంచెం పెద్ద ఇంట్లోకి మారుతున్నాం!"

"అవునులెండి. రాష్ట్ర విభజన ముందే స్ట్రాటెజిక్‌గా ఇన్వెస్ట్ చేయడం మంచి ఆలోచనే!" అతను మామూలుగానే అన్నా, ఏదో వ్యంగ్యం ధ్వనించింది.

"ఇంతకీ ఎక్కడ ఇల్లు?" జర్మన్ డిపార్ట్మెంట్‌లో రీడరు మైథిలి అడిగింది.

"నల్లగండ్ల. అక్కడ ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఇళ్ళు కొనుక్కోవడానికి భాను వాళ్ళ కంపెనీ లోన్ ఇచ్చింది."

"అంతా సాఫ్ట్ వేర్ మహిమ సారూ! భార్యా భర్తల్లో ఒకళ్ళు సాఫ్ట్‌వేర్‌లో వుంటే ఒకటేమిటి, ఎన్ని ప్రాపర్టీల్లోనైనా ఇన్వెస్టు చేయొచ్చు!" అడ్మినిస్ట్రేషన్‌లో పని చేసే శ్రీకాంత్ అన్నాడు. అందరూ ఏదో జోకు విన్నట్టు గొల్లుమన్నారు. అశోక్ మొహం ఎర్రబడింది.

"సాఫ్ట్‌వేర్ జీతాలేమీ వూరికే రావండీ! తీసుకుంటున్న జీతానికి భాను ఎంతో కష్టపడి పని చేస్తుంది," అనాడు.

"అఫ్ కోర్స్! భార్యలు అంత ఏంబిషస్‌గా వుంటే మన పని సులువవుతుంది! మీరన్నట్టు అంతంత కష్టపడి వాళ్ళు పని చేయాలంటే, ఇల్లూ వాకిలీ గోవింద!" శ్రీకాంత్ మళ్ళీ జోక్ చేసాడు. చదువుతున్న పేపరు పక్కన పెట్టి లేచాడు మూర్తి, సోషియాలజీ ప్రొఫెసరు.

"అసలు కోస్తా ఆంధ్రా వాళ్ళు హైదరాబాదులో ఎడాపెడా ఆస్తులు కొనేసి ధరలు పెంచుతున్నారు బాబూ!"

"మూర్తి గారూ! మాది ఖమ్మం. భానుది రాజమండ్రి. ఇద్దరమూ హైదరాబాదులో పుట్టినప్పటినించీ వున్నాము, ఇక్కడే పెరిగాము, ఇక్కడే చదువుకున్నాను, ఇక్కడే వుద్యోగాలు వెతుక్కున్నాము. నేను ఇక్కడే పిల్లలకి పాఠాలు చెప్తున్నాను. ఈ నగరం కాకుండా ఇంకో చోటికి వెళ్ళాలన్న ఆలోచన కూడా రాలేదు ఇప్పటివరకూ!"

"అయ్యో! మిమ్మల్ని అనడంలేదండీ. ఊరికే అన్నా అంతే! అందరమూ తప్పక వస్తాం లెండి గృహప్రవేశానికి," మూర్తి లేచి అశోక్ భుజం తట్టి వెళ్ళిపోయాడు.

"అవకాశాలూ, ఉద్యోగాలూ, డబ్బూ, అన్నీ హైదరాబాదునే అంటిపెట్టుకుని ఉన్నాయండీ!" కిరణ్ కూడా లేచి వెళ్ళిపోయాడు.

"వాళ్ళ మాటలు పట్టించుకోకండి అశోక్ గారూ! పక్క వాళ్ళు పైకొస్తుంటే చూసి ఓర్వలేని మనుషులు! ఇంతకీ పిల్లలేం చదువుతున్నారు? మీ వాడు అప్పుడప్పుడూ ఫిలిం క్లబ్‌లో కనిపిస్తూ వుంటాడు. ఏ స్కూలు? ఇక్కడ కేవీలోంచి తీసేసి అక్కడ ఇంకేదైనా స్కూల్లో వేస్తారా?" శైలజ సంభాషణ మార్చింది.

"అవునండీ. అక్కడికి దగ్గర్లో వుండే స్కూల్లో వేయాలని చూస్తున్నాం. బాబు తొమ్మిదో తరగతిలోకీ, పాప ఏడో తరగతిలోకీ వస్తారు."

"ఎక్సైటింగ్ టైం, మీ ఫేమిలీ కంతటికీ!"

అతనికి ఎక్సైట్‌మెంట్ కంటే ఎక్కువ తీర్చవలసిన లోను ఈ.ఎం.ఐ. లే ఎక్కువ కనిపిస్తున్నాయి. తను కూకట్‌పల్లి అపార్ట్‌మెంట్ గృహ ప్రవేశానికి కూడా దగ్గరి కొలీగ్స్‌ని పిలిచాడు. కానీ ఇంత చర్చ జరగలేదు ఆరోజు. చుట్టూ మారుతున్న రాజకీయ, సాంఘిక వాతావరణం మనుషుల ఆలోచనలని మార్చేమాట నిజమే అయినా, అది ఇంత దగ్గరగా చూడటం ఇదే మొదలు అతనికి.

ఆంగ్ల సాహిత్యంతో పాటు అతను పిల్లలకి "నేషనలిజమూ", "ఫెడరలిజమూ", "స్వయం–నిర్ణయాధికారమూ" లాటి రాజకీయ సిద్ధాంతాలు బోధించాడు. చర్చలు ప్రోత్సహించాడు. కానీ ఆ ప్రకంపనల ప్రభావం ముఖా ముఖీ ఎదుర్కోవడం ఇబ్బందిగా, కొత్తగా వుంది. ఫాకల్టీ లౌంజి వదిలి బయటికొచ్చి తన డిపార్ట్‌మెంట్ ఆఫీసు వైపు

నడిచాడు అశోక్. బయట విద్యార్థులంతా గోల గోలగా వాదించుకుంటున్నారు, భాషల గురించీ, యాసల గురించీ, భాషా రాజకీయాల గురించీ!

అతనికి పీహెచ్‌డీ అప్లికేషను తీసుకొని భానుతోపాటు తను ఇక్కడికొచ్చిన రోజు గుర్తొచ్చింది. అప్పుడే ఎన్ని యేళ్ళు గడిచిపోయాయి! ఆ రోజు తన వయసు ఇరవై దరిదాపుల్లో వుంటే ఈనాడు తను నలభై దాటిన మధ్య వయస్కుడు! ఈ ఇన్స్టిట్యూటూ, హైదరాబాదు నగరమూ ఎంత మారిపోయాయి ఇరవై యేళ్ళల్లో! చాలా మారింది, కానీ యేమీ మారలేదు కూడా! తనూ భానూ కూడా అంతేనేమో. చాలా మారారు, కానీ యేమీ మారలేదు.

*********************

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS